క్లుప్తంగా

పల్లె రవికుమార్‌కు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్, అల్లం నారాయణ

జోగిపేట(అందోల్): తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పారిశ్రామిక ఆర్థిక కార్పొరేషన్ తొలి చైర్మన్‌గా సీనియర్ జర్నలిస్టు పల్లె రవికుమార్‌గౌడ్ నియమితులైన సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ ఉద్యమంలో రవికుమార్ జర్నలిస్టులను ఏకం చేసి పోరుబాట పట్టించడంతో పాటు మిలియన్‌మార్చ్, సాగరహారం, సకలజనుల సమ్మెలో జర్నలిస్టు నేతగా ముందు నిలిచాడని గుర్తు చేశారు. మీడియా అకాడమి చైర్మన్ అల్లం నారాయణ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతిసాగర్ ఎమ్మెల్యేతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంఈఓ కార్యాలయం సందర్శన



డీఈఓ వేంకటేశ్వర్లును సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ఎంఈఓ కార్యాలయాలన్ని డీఈఓ వేంకటేశ్వర్లు గురువారం సందర్శించారు. డీఈఓగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా ఎంఈఓ కార్యాలయానికి రావడంతో ఎంఈఓ పీపీ రాథోడ్, సిబ్బంది డీఈఓను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం డీఈఓ వెంకటేశ్వర్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



మామిడ్గిలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మామిడ్గి, గణేష్‌పూర్, హుస్సెల్లి, శంశల్లాపూర్, వడ్డి, గుంజోటి, రాంతీర్థ్, న్యాల్‌కల్, ముంగి, రుక్మాపూర్ తదితర గ్రామాల్లో ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. అదేవిధంగా ఆయా పొలాల వద్ద కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నాగభూషణం తదితరులు ఉన్నారు.

ఐకమత్యంతోనే పద్మశాలీల ఆర్థికాభివృద్ధి



సభ్యత్వ నమోదు పుస్తకాలను అందజేస్తున్న నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): ఐకమత్యంతోనే పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని పద్మశాలి సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గుండు సత్యనారాయణ అన్నారు. గురువారం పట్టణంలోని చేనేత సహకార సంఘం భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16న సంగారెడ్డిలోని వైఎంఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించే పద్మశాలి సంఘం రాష్ట్ర ఎన్నికల ఓటర్ నమోదు కార్యక్రమానికి పద్మశాలీలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పట్టణంలోని ఏడు కాలనీలకు సంబంధించిన సభ్యత్వ నమోదు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పట్టణ చేనేత సహకార సంఘం అధ్యక్షులు చింతా గోపాల్, పద్మశాలి యువత రాష్ట్ర అధ్యక్షుడు గందేమల్లే రాజు, జిల్లా కార్యదర్శి సుప్పాల శ్రీనివాస్, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు అంబటి విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి సిల్వేరి రవి పాల్గొన్నారు.

కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలం

ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

రాయికోడ్(అందోల్): బీఆర్‌ఎస్ కార్యకర్తలే బలమని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. రాయికోడ్‌లో గురువారం ఎమ్మెల్యే అధ్యక్షతన నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. నాలుగేళ్లలో ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.50 లక్షల నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేశామని తెలిపారు. మూడు నెలల్లో మండలంలోని రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. అంతకుముందు భారీ ర్యాలీతో సభాస్థలానికి చేరుకుని సీఎం కేసీఆర్ కార్యకర్తలకు ఇచ్చిన సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మంజుశ్రీజైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కులమతాలకు అతీతంగా పథకాలను అమలు చేస్తూ అన్నివర్గాలు అభివృద్ధి చెందేవిధంగా కృషి చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్, ఎంపీపీ మమత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బసవరాజ్‌పాటిల్, శంకర్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్దప్పపాటిల్, వట్‌పల్లి ఏఎంసీ చైర్మన్ రజినికాంత్, రాయికోడ్ ఏఎంసీ వైస్ చైర్మన్ మారుతి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థినులకు సన్మానం



విద్యార్థినులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన రంజోల్ సాంఘీక సంక్షేమ బాలికల గురుకులం విద్యార్థినులైన శిరీష, శ్రీజ, ప్రియాంక, షబానా, మమత, ఈశ్వరి, అంకితలను గురువారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

కోహీర్(జహీరాబాద్): ఈ నెల 13 తేదీన నిర్వహించే ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. గురువారం మండలంలోని గొడిగార్‌పల్లి పర్వపల్లి, బిలాల్‌పూర్, బడంపేట, పైడిగుమ్మల్, రాజనెల్లి,, గురుజువాడ, మద్రి గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కోహీర్ ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. మండలంలోని రాజనెల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు నర్సింహులుయాదవ్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు బంటు రామకృష్ణ, సర్పంచులు నర్సింహులు, సంగారెడ్డి, రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లింగాయత్‌లను ఓబీసీలుగా ప్రకటించాలి

పటాన్‌చెరు టౌన్: లింగాయత్‌లను ఓబీసీలుగా ప్రకటించాలని లింగాయత్ సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజు అన్నారు. గురువారం పట్టణంలోని మార్కెట్ రోడ్డులో జూన్ 4వ తేదీన నిర్వహించనున్న లింగాయత్ మహార్యాలీకి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, విజేందర్, శేఖర్, నరేశ్, నాగప్ప పాల్గొన్నారు.

15 నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): ఈనెల 15, 16, 17 తేదీల్లో రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ తెలిపారు. క్రీడాపోటీలకు సంబంధించి గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, లాంగ్‌జంప్, హైజంప్ క్రీడలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కు స్వాగతం



బండి సంజయ్‌కు స్వాగతం పలుకుతున్న అంజిరెడ్డి, నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సంగారెడ్డిలో నిర్వహించనున్న బీజేపీ నిరుద్యోగ మార్చ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కు గురువారం రామచంద్రాపురం పట్టణంలో రాష్ట్ర మహిళా మోర్చ మాజీ ప్రధాన కార్యదర్శి గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు.

జేపీఎస్‌ల సమస్యలను పరిష్కరించాలి



సమ్మె శిబిరంలో కూర్చున్న ఎంపీపీ, నాయకులు

జహీరాబాద్ టౌన్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ గిరిధర్‌రెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద 14 రోజులుగా సమ్మె చేస్తున్న కార్యదర్శులకు గురువారం సంఘీభావం తెలిపి సమ్మెలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్‌లు న్యాయబద్ధమైనవని, ప్రభుత్వం వారితో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహ్మారెడ్డి, కండెం నర్సింలు, నరేష్, రాములు, అక్బర్, నర్సింలు పాల్గొన్నారు.

ఘనంగా జగదాంబ విగ్రహ ప్రతిష్ఠాపన



జగదాంబమాతను దర్శించుకుంటున్న నగేష్ షెట్కార్, నాయకులు

నారాయణఖేడ్: మండల పరిధిలోని కొండాపూర్‌లో గురువారం జగదాంబ సహిత సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అఖిలభారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి, కొండాపూర్ హనుమాన్ ఆలయ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్‌తో పాటు వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు హాజరై విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేష్ చౌహాన్, కాంగ్రెస్ నాయకులు నెహ్రూ నాయక్, మారుతినాయక్, విఠల్, రవీందర్ నాయక్, మాణిక్‌రావు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



పూజలు చేస్తున్న కార్పొరేటర్, మార్కెట్ కమిటీ చైర్మన్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని జీపీ కాలనీలో నూతంగా నిర్మించిన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ దంపతులు, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పోస్ట్‌కార్డులతో వీఓఏల నిరసన



కొండాపూర్: పోస్టు కార్డులను పోస్టుబాక్స్‌లో వేస్తున్న వీఓఏలు

జోగిపేట(అందోల్): ఐకేపీ వీఓఏల సమ్మెలో భాగంగా గురువారం పోస్టుకార్డులతో నిరసన చేపట్టారు. సీఎం కేసీఆర్, పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర రావులకు పోస్టుకార్డులు రాశారు. ఈ సందర్భంగా వీఓఏలు తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వీఓఏల అధ్యక్షుడు మల్లయ్య, కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి విజయ, వీఓఏలు పాల్గొన్నారు.

కొండాపూర్(సంగారెడ్డి): వీఓఏల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, వీఓఏల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డిలో గురువారం వీఓఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పోస్ట్‌కార్డులను పంపించారు. కార్యక్రమంలో వీఓఏలు అనిత, వీరేశం, కవిత, భాగ్యలక్ష్మి, కాంతమ్మ, స్వప్న, యమున, లక్ష్మి పాల్గొన్నారు.



న్యాల్‌కల్‌లో సమ్మె చేస్తున్న వీఓఏలు

25వ రోజుకు వీఓఏల సమ్మె

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని ఐకేపీ కార్యాలయం ఆవరణలో వీఓఏలు చేపట్టిన సమ్మె గురువారంతో 25వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో వీఓఏలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు ఆంజనేయచౌదరి మృతి



ఆంజనేయచౌదరి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని దౌల్తాబాద్ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు ఆంజనేయచౌదరి మృతి చెందాడు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులకు ఆంజనేయచౌదరి సుపరిచితుడు. టీడీపీలో చురుకైన పాత్ర పోషించిన ఆంజనేయచౌదరి నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ త్రిసభ్య కమిటీ సభ్యులుగా పని చేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తుదిశ్వాస వదిలారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆంజనేయచౌదరి నివాసానికి చేరుకొని నివాళులర్పించారు. ఎంపీపీ వావిలాల నరసింహులు జెడ్పీటీసీ ఆంజనేయులు పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, స్థానిక సర్పంచ్ కొన్యాల వెంకటేశం, టీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు ఆజ్జు తదితరులు ఆంజనేయచౌదరికి నివాళులర్పించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

నారాయణఖేడ్: మండలంలోని హన్మంత్‌రావుపేట్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వేంకటేశ్వరస్వామి భూదేవి సమేత కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి భక్తులు అధికసంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించారు.

బాంబు నిర్వీర్యంపై మాక్ డ్రిల్



మాక్ డ్రిల్‌లో అధికారులు, సిబ్బంది

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ వద్ద రాష్ట్ర బాంబుస్క్వాడ్, భెల్ సీఐఎస్‌ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో బాంబు నిర్వీర్యంపై మాక్ డ్రిల్ నిర్వహించారు. గురువారం కార్మికులకు భద్రతపై సీఐఎస్‌ఎఫ్ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏజీఎం సుజన, సీఐఎస్‌ఎఫ్ కమాండెంట్ మంజిత్ కుమార్ పాల్గొన్నారు.

వీధి దీపాలను ఏర్పాటు చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్‌లో విద్యుత్ దీపాలు లేని ప్రాంతాల్లో వెంటనే విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని స్థానిక కార్పొరేటర్ పుష్పనగేష్ అధికారులను ఆదేశించారు. గురువారం రామచంద్రాపురం పట్టణంలోని సంత ప్రాంగణం, హిందూ శ్మశానవాటికను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంత ప్రాంగణం, శ్మశానవాటికలలో విద్యుత్‌దీపాలను లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీంతో ప్రతిపాదనలను తయారుచేసి వీధిదీపాలను ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కొనసాగుతున్న దుర్గమాత విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ దంపతులు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆమీన్‌పూర్ గ్రామంలో నిర్వహిస్తున్న దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 12వ తేదీ శుక్రవారం దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించనున్నట్లు, భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని పాండు రంగారెడ్డి తెలిపారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న సంజీవరెడ్డి

నారాయణఖేడ్: మనూరు మండలంలోని తోర్నాల్‌కు చెందిన కాంగ్రెస్ సభ్యుడు యోహాన్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. సభ్యత్వం పొందినవారికి పార్టీ బీమా చేయించడంతో రూ.2లక్షల చెక్కు మంజూరైయింది. ఈ మేరకు గురువారం మృతుడి భార్య మారుతమ్మకు చెక్కును టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి తన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు సుధాకర్ రెడ్డి, మల్లికార్జున్‌పటేల్, సంగారెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఎల్లమ్మ ఆలయంలో పూజలు

మునిపల్లి(అందోల్): మండలంలోని మన్‌సాన్‌పల్లి గ్రామ శివారులో రేణుక ఎల్లమ్మ అమ్మవారి దేవాలయంలో గురువారం బీఆర్‌ఎస్ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రయ్య, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు పరశురాం గౌడ్, అలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

◆ నేటి నుంచి మెథోడిస్టు క్రైస్తవ ఉజ్జీవ సభల జాతర

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని అల్లీపూర్‌లో 91 మెథోడిస్టు క్రైస్తవ ఉజ్జీవసభల జాతర శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని నిర్వాహకులు డాక్టర్ సరీస్‌జాన్, రవికుమార్ తెలిపారు. ఈ నెల 14 వరకు ఉజ్జీవసభల జాతర కొనసాగుతుందని తెలిపారు. 12న వివిధ గ్రామాల నుంచి జెండాలతో ఊరేగింపు, 13న దైవధ్యానం, బాప్తిస్మంలతో పాటు ఉచిత వైద్యశిబిరం, ఆటల పోటీలు, సంగీత పోటీలు, నాటక ప్రదర్శన, చలనచిత్ర పదర్శనలతో పాటు మొగుడంపల్లి జైరాజ్‌చే బుర్రకథ ప్రదర్శన ఉంటుందన్నారు. 14న దైవ ఆరాధన, బిషప్ డ్యానియల్‌చే దైవసందేశం, రోగుల కోసం ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయని వివరించారు.

◆ ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



జోగిపేట(అందోల్): సత్యసాయి సేవా సమితి జోగిపేట ఆధ్వర్యంలో గురువారం స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. మజ్జిగ పంపిణీకి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని తెలిపారు.

◆ రంగనాథస్వామి ఆలయంలో పూజలు

జోగిపేట(అందోల్): అందోల్ గ్రామంలోని రంగనాథస్వామి ఆలయంలో భూనిలా సమేత రంగనాథస్వామి వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన తిరు కళ్యాణ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మఠం భిక్షపతి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

◆ నేడు అయప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని ఊట్ల గ్రామంలో గురువారం అయ్యప్పస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు సర్పంచ్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ శివరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠానకు భక్తులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

◆ బాలికలకు రక్షణ కల్పించాలి

సదాశివపేట(సంగారెడ్డి): రాష్ట్రంలోని నవోదయ గురుకుల పాఠశాలల్లో బాలికలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద అన్నారు. గురువారం ఆ పార్టీ పట్టణ కార్యాలయంలో అమె మాట్లాడారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో హస్టల్‌కు పంపిస్తే అక్కడ బాలికలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కొంత మంది ఉన్మాదులు అభం శుభం తెలియని బాలికలకు మాయమాటలు చెప్పి లైంగికదాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హస్టళ్లలో చదువుతున్న 13, 14 ఏళ్ల వయసున్న బాలికలు గర్భం దాల్చిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నహోదయ, ఇతర బాలికల గురులకు పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాధిక, లక్ష్మి పాల్గొన్నారు.

◆ కొనసాగుతున్న ఆలయ ఉత్సవాలు

మనూరు(నారాయణఖేడ్): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన బోరంచ నల్లపోచమ్మ ఆలయ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం భక్తులు అధికసంఖ్యలో హాజరై పూజలు చేశారు.

◆ పశువులను రోడ్లపై వదిలితే చర్యలు

జహీరాబాద్ టౌన్: పశువులను రోడ్లపై వదిలితే చర్యలు తీసుకుంటామని జహీరాబాద్ టౌన్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. జహీరాబాద్ పట్టణంలో ఆవులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని, రోడ్లపై సేదతీరుతుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. దీంతో పశువుల యజమానులు పశువులను రోడ్లపై వదలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు.

◆ రేపటి నుంచి హనుమాన్ ఆలయ వార్షికోత్సవాలు

జహీరాబాద్ టౌన్: మండలంలోని కాశీంపూర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవాన్ని ఈ నెల 13 నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రెండు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

◆ నేటి నుంచి ఆధ్యాత్మిక సభలు

నారాయణఖేడ్: పట్టణ శివారులోని అనురాధ కళాశాల మైదానంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజులపాటు ఇన్నాఅల్లాహ్ పేరిట ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి ఆధ్యాత్మిక సభలు (ఇజ్తెమా) నిర్వహించనున్నట్లు, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొని ప్రసంగిస్తారని నిర్వాహకులు తెలిపారు.

◆ సంగారెడ్డికి తరలిన బీజేపీ శ్రేణులు

జహీరాబాద్ టౌన్: నిరుద్యోగుల మార్చ్‌లో పాల్గొనేందుకు గురువారం బీజేపీ నాయకులు సంగారెడ్డి తరలివెళ్లారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపు మేరకు సంగారెడ్డిలో నిరుద్యోగ మార్చ్ నిర్వహించారు. పాల్గొనేందుకు జహీరాబాద్ బీజేపీ నాయకులు సుధీర్‌కుమార్, రాంచందర్, మల్లికార్జున్ పాటిల్,తదితరులు సంగారెడ్డికి తరలివెళ్లారు.

◆ ఉపాధిహామీ బకాయిలు చెల్లించాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఉపాధి హామీ కూలీల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు మండల పరిధిలోని ఆత్మకూరు, ఎన్కపల్లి గ్రామాల్లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు పర్యటించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింలు మాట్లాడుతూ కూలీలకు నాలుగు నెలలుగా డబ్బులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.